# వినాయకరావ్ విజయం

**ఆరేళ్ళు** అజ్ఞాతంగా వుండిపోయిన ప్రసిద్ధ రచయిత వినాయకరావ్ సీరియల్ నవల 'విరిసిన కమలం' ఓ ప్రముఖ వార పత్రికలో ప్రారంభం కావడంతో పాఠకుల ఎదల్లో పన్నీరు చిలికినట్లయింది. సంతోషం పట్టలేక అభిమానులంతా అతడిని ఘనంగా సన్మానించాలని సంకల్పించుకున్నారు. వినాయకరావ్‌ని సంప్రదించి తేదీ నిర్ణయించారు. అందుకు స్వచ్ఛంద సంస్థలన్నీ సహకరించడంతో చక్కని వేదిక సిద్ధమైంది. సభాస్థలి పెళ్ళిపందిరిలా సింగారించుకుని సాహిత్యాభిమానులకు సాదరంగా ఆహ్వానం పలుకుతోంది.

ఇసుక వేస్తే రాలనంతగా జనం హాజరయ్యారు.

కార్యకర్తలు వినాయకరావ్‌ని సన్మానించే బాధ్యత శ్రీహర్ష మీద ఉంచారు. అతడొక ఉన్నత ప్రభుత్వోద్యోగి. సాహిత్యంలో సరిగమలు తెలియక పోయినా ఓ మహారచయితను సన్మానించమని అభ్యర్థించడంతో ఉబ్బితబ్బిబ్బయిపోయి, వచ్చిన అవకాశం ఎక్కడ చేజారిపోతుందోనని వెంటనే ఒప్పేసుకున్నాడు. అంతే కాదు, తన వంతు విరాళం వెయ్యినూట పదహార్లన్నాడు.

నిర్దేశించిన సమయానికి అట్టహాసంగా ఆరంభమైంది నాటి కార్యక్రమం.

సన్మానకర్త శ్రీ హర్షనీ, సన్మానితుడు వినాయకరావ్‌నీ తదితర వక్తల్నీ సగౌరవంగా వేదిక మీదకు ఆహ్వానించారు.

వినాయకరావ్‌ని చూడటంతోనే షాక్‌తిన్నాడు శ్రీ హర్ష. అతడి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

రచయిత పెదవుల మీద మాత్రం చిరునవ్వు చెక్కుచెదరలేదు.

నిర్వాహకులు తన వద్దకొచ్చినప్పుడు "ఓ మహారచయితకు సన్మానమన్నారే తప్ప వినాయక రావ్ పేరెత్తలేదు. సరే, వాళ్ల మాట అటుంచి ఆ సమయంలో తన బుద్ధి ఏమైనట్టు? సన్మానం ఎవరికని ఒక ముక్క అడగొచ్చు కదా" అంత వరకు శ్రీహర్షలో నిబిడంగా ఉన్న అసూయాద్వేషాలు పెల్లుబికాయి. సభా సంప్రదాయాల్ని ఉల్లంఘించలేక ముళ్లమీద కూర్చునట్లు కూర్చున్నాడు. అయిష్టంగానే శాలువా కప్పి పూలమాల వేసి, పాతిక వేల రూపాయల పర్సు బహూకరించి సత్కరించాడు.

'సభికుల' కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

పురోహితుల వేద మంత్రోచ్చారణతో ప్రాంగణం ప్రతిధ్వనించింది.

శ్రీ హర్ష ఒంటిమీద పాములు పాకుతున్నట్లున్నాయి.

కార్య క్రమంలో ముందుగా అధ్యక్షుని తొలి పలుకులని ఉండటంతో లేచి తన ప్రసంగాన్ని మూడు ముక్కల్లో ముగించి కూర్చున్నాడు.

వినాయకరావ్ ప్రతిభా పాటవాల్ని ప్రశంసిస్తూ వక్తల ఉపన్యాసాలు జోరుగా సాగుతున్నాయి.

అంత కంటే వేగంగా శ్రీహర్ష మస్తిష్కంలో గతించిన సంఘటనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

★ ★ ★

ఆ రోజు మధ్యాహ్నం పన్నెండవుతోంది. ఆఫీసులో స్టాఫంతా ఎవరిపనిలో వారున్నారు.

శ్రీహర్ష ఫైల్సు మీద సంతకాలు చేస్తూ వినాయకరావ్‌ని పిలిపించాడు.

ఆ రోజు శ్రద్ధగా తయారు చేసిన ఫైలు పుచ్చుకుని ఆఫీసరు గదిలో అడుగుపెడుతూ 'రావచ్చునా'? అన్నట్లు ఆగాడు వినాయకరావ్.

"కమిన్. అలా కూర్చో! నీతో మాట్లాడాలి"

రివాల్వింగ్ ఛెయిర్‌లో అటూ ఇటూ ఊగుతున్న బాస్ ముందు కూర్చోలేక నిలబడే వున్నాడు వినాయకరావ్.

"పరవాలేదు కూర్చో"

శ్రీహర్ష ఒత్తిడి చేయడంతో కూర్చోక తప్పలేదు వినాయకరావ్‌కి.

"ఔను, నువ్వు కథలు రాస్తావట"

ఊహించని ప్రశ్నకు ఉలిక్కి పడ్డాడు వినాయకరావ్.

మళ్లీ శ్రీహర్షే అన్నాడు. "నువ్వు కథలు రాస్తావని నాకు నిన్ననే తెలిసింది" అన్‌డౌటెడ్లీ ఇట్ ఈజ్ ఎ వేరీగుడ్ హాబీ"

"ఏదో అప్పుడప్పుడు" తెగ మొహమాటపడి పోయాడు వినాయకరావు.

"నాకూ చిన్నప్పటి నుంచీ రచనలు చేయాలని అభిలాష ఉండేది"

"అలాగా, ప్రయత్నిస్తే సాధ్యం కానిదంటూ ఉండదు సార్"

"అఫ్ కోర్స్... నువ్వీ కవిత చదివి ప్రచురణార్హమో కాదో చెప్పు" అంటూ ఒక కాగితం తీసి అతడికిచ్చాడు శ్రీహర్ష.

బాస్ రాసిన 'పంక్తుల్ని ఒకటికి పదిసార్లు చదివాడు వినాయకరావ్. అతడి కవిత్వానికి నవ్వాలో ఏడ్వాలో తెలియలేదు.

"క్షమించండిసార్. నాకు కథలు తప్ప కవితలు రాయడం రాదు" తప్పించుకో చూశాడు సమాధానం స్ఫురింపక.

"పోనీ ఈ కథ చదివి చెప్పు" సొరుగులోంచి పది పేజీల కథ తీసాడు శ్రీహర్ష.

బాస్ ఇక వదిలేటట్లు లేడనుకుని "తాపీగా చదివి తరువాత చెబుతానుసార్ అభిప్రాయం" అన్నాడు వినాయకరావ్ వినమ్రంగా.

"తొందర్లేదు. టేక్ యువర్ ఓన్ టైమ్. అవసరమనుకుంటే మార్పులు చేర్పులు చేసి పట్టుకురా" ఆదేశించాడు శ్రీహర్ష.

"అలాగే సార్" నీళ్ళు నమిలాడు వినాయకరావ్.

తలా తోకలేని ఆ కథకో రూపం ఇవ్వడానికి ఆ రాత్రంతా బుర్రబద్దలు కొట్టుకున్నాడు వినాయకరావ్.

ఆ రోజు లగాయితూ బాస్ రాసిచ్చిన కథల్ని చదివి, దిద్దడం వినయకరావ్ వంతైతే - వాటిని ఓపిగ్గా ఫెయిర్ చేసుకుని పత్రికలకు పోస్టు చేయడం శ్రీహర్ష వంతైంది.

ఆరు మాసాలు గడిచాయి. వినాయకరావ్‌వి పాతిక కథలు పత్రికలలో పడ్డాయి. శ్రీహర్ష కథ ఒక్కటంటే ఒక్కటి కూడా అచ్చుకు నోచుకోలేదు. దాంతో అతడికి వినాయకరావ్ పట్ల అసూయ చోటు చేసుకుంది.

వినాయకరావ్ కథలు సూపర్బ్ అంటూ పాఠకాభిమానులు లేఖాస్త్రాలు గుప్పిస్తూ ఉంటే అసూయాగ్నితో శ్రీహర్ష శరీరం దహించుకుపోసాగింది.

పరిశీలించమని వినాయకరావ్‌కి మరి కథలివ్వడం మానుకున్నాడు శ్రీహర్ష.

నాటి నుండి 'ఏలిన నాటి శని' ప్రవేశించింది వినాయకరావ్‌కి. ఆఫీసుకు అరగంట ఆలస్యమైనా నోరుమెదపని శ్రీహర్ష ఇప్పుడు ఐదు నిమిషాలు లేటయితే చాలు మండిపడుతున్నాడు.

"ఫైలు ఇలాగేనా రాసేది? అసలు నీకు ఆఫీసు పనిమీద ధ్యాస ఉందా?... ఔన్లే ఎలాగుంటుంది? ఉన్న సమయం కథలు రాసుకోడానికే సరిపోవడం లేదు" శ్రీహర్ష మాటలలో అవహేళన! చూపుల్లో ఛీత్కారం!

"ఆఫీసులో నేనెప్పుడూ కథలు..."

"షటప్" కటువుగా అన్నాడు శ్రీహర్ష. అతడి నేత్రాలు నిప్పులు కక్కుతున్నాయి.

ఫైలు తిరిగి రాసిపట్టుకొస్తానని చెప్పి బయటపడ్డాడు వినాయకరావ్.

ఇలా ఉండగా ఒకమారు బహుమతి గ్రహీతగా పత్రికల వాళ్ళు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి హాజరయ్యేందుకు రెండ్రోజులు సెలవు పెట్టి, రాష్ట్ర రాజధాని వెళ్ళాడు వినాయకరావ్.

విషయం తెలుసుకునన్నా శ్రీహర్ష సెలవు దరఖాస్తు మీద 'నాట్ గ్రాంటెడ్' అనిరాసి ఆ రెండ్రోజులు జీతం ప్రభుత్వఖజానాకు జమచేసి అతడి పొట్టమీద కొట్టాడు.

కేవలం ఈర్ష్యతోనే శ్రీహర్ష తనపై ద్వేషం పెంచుకున్నాడని వినాయకరావుకు తెలుసు. అందుకే అన్నిటికీ మూగనోము పట్టాడు.

మెత్తగా ఉన్నవాణ్ని చూస్తే మొత్తబుద్ధివేస్తుంది. అందుకే నేమో వినాయకరావ్ మీద ఉన్నవీ లేనివీ రాస్తూ ఒక పెద్ద ఫైలు తయారు చేసాడు శ్రీహర్ష.

మనశ్శాంతి కరువైంది వినాయకరావ్‌కి.

రచనావ్యాసంగం కుంటుపడింది.

అభిమానులు రాసిన ఉత్తరాలకు కూడా జవాబులిచ్చే స్థితిలో లేడు.

బాస్ పెడుతున్న చిత్రహింసల్ని భరించలేక ట్రాన్స్‌ఫర్‌కు ధరఖాస్తు పెట్టుకున్నాడు.

ఉద్యోగి ఏ కాగితాన్నయినా సంబంధింత అధికారి ద్వారా హెడ్డాఫీసుకు పంపించుకోవాలి. ప్రభుత్వం ఆ నియమం ఎందుకు పెట్టిందోగాని అది వినాయకరావ్ పాలిట శాపమైంది.

బదిలీ దరఖాస్తుని పైకి పంపకుండా త్రొక్కేసి అతడిని మరింత బాధపెట్టసాగాడు శ్రీహర్ష.

"మీ కథలు అచ్చువడం లేదన్న దుగ్ధతో మీ వద్ద పనిచేసే ఓ అసిస్టెంటునిలా కాల్చుకు

తినడం ఏం న్యాయం?" అని సిబ్బందిలో ఏ ఒక్కరూ శ్రీహర్షని ప్రశ్నించలేకపోయారు.

ఎవ్వరూ ఊహించని విధంగా 'ఉన్నట్లుండి' వినాయకరావ్‌కి విశాఖపట్నం బదిలీ అయింది.

ఇష్టం లేకున్నా రిలీవ్ చేయక తప్పలేదు శ్రీహర్షకి.

పంజరం నుంచి బయటపడ్డ పక్షిలా గుండెలు నిండుగా గాలి పీల్చుకున్నాడు వినాయకరావ్. విశఖ ప్రకృతి సౌందర్యం అతడి మనసును అలరించింది. సాయంత్రాలు బీచిలో ఇసుకతిన్నె మీద కూర్చుని కడలిలో ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల్ని చూస్తూ కాలాన్ని కరిగించడం అలవాటు చేసుకున్నాడు. కొన్నాళ్ళకు మళ్ళీ రచనలు చేయాలన్న కోర్కె జనించడంతో "విరిసిన కమలం" అనే నవల రాసి ప్రముఖ వార పత్రికకు పంపాడు. ప్రచురణకు స్వీకరించినట్లు సంపాదకుడి నుంచి లేఖ రావడంతో ఉత్సాహం రెట్టింపై, తిరిగి కథారచనకు శ్రీకారం చుట్టాడు.

ఎన్నో ఏళ్ళ తర్వాత వినాయకరావ్ రచనలు పత్రికలలో కనబడ్డంతో పాఠకుల ఆనందం అవధులు దాటింది. అభిమానుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. దాని ఫలితమే నేటి ఈ సన్మానం.

★ ★ ★

వక్తల ఉపన్యాసాలు ముగిసాయి.

చివరగా "సన్మానితుని సమాధానం" అన్నాడు అధ్యక్ష స్థానంలో ఉన్న శ్రీహర్ష.

శాలువా సరిచేసుకుంటూ నిలబడ్డాడు వినాయకరావ్.

చప్పట్లు మార్మోగాయి.

శ్రీహర్షకు గుండెదడ ప్రారంభమైంది.

'సభకు నమస్సులు! అభిమానులందరికీ నా జోహార్లు!

గత కొన్నేళ్ళుగా తుప్పుపట్టిమూల పడిన నా కలాన్ని తెరిపించిన పాఠకలోకానికి నేనెంతగానో ఋణపడివున్నాను. మీ అందరి అండ నేడు నామెడలో పూలదండ అయింది. ఈ క్షణం నా జీవితంలో మరపురాని మధుర క్షణం.

సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం ఇలా ఏ కళకైనా సాధన తోడైతేనే అది వజ్రంలా ప్రకాశిస్తుంది. ప్రతివ్యక్తీ ఏదో ఒక రంగంలో ప్రతిబ కలిగి ఉంటాడు. మనం కాస్త ప్రోత్సాహాన్నిస్తే అతడా రంగంలో కళాఖండాలు సృష్టించగలడు. అందుకు బదులుగా అసూయా ద్వేషాలతో మూర్ఖంగా అతడిలోని కళను అంతం చేయాలనుకుంటే మనలో మచ్చుకైనా కళాకారుడు మిగలడు. మనలో లేనిది ఎదుటివారిలో కనిపించినప్పుడు మన మనసు స్పందించాలి. ఆ వ్యక్తి ప్రతిభకు పట్టం గట్టాలి. అప్పుడే కళలు పదికాలాల పాటు నిలుస్తాయి...."

వినాయకరావ్ పలికిన ప్రతి పలుకు శ్రీహర్ష గుండల మీద సమ్మెట పోటైంది. అసలు తనను సన్మానించడానికి శ్రీహర్షను పిలవమని వినాయకరావ్ కోరాడని తెలిస్తే అతడేమై పోయేవాడో?!

**(16-11-1994, గీతాంజలి పక్షపత్రిక)**